ప్రజాశక్తి

మంగళవారం 16 సెప్టెంబర్ 2025

5

అల్లూరి సీతారామరాజు



సిఎం, డిసిఎంలకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పార్టీలో కష్టపడినందుకు పదవి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడుకిల్లో సాయిరాం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలోకిల్లో సాయిరాం మాట్లాడుతూ తెదేపా పార్టీలో క్షేత్రస్థాయిలో నుండి కష్టపడి జెండా మోసుకుని పనిచేశానన్నారు. ప్రజలకు సేవలు అందించడానికి ముందు ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిల్లో కుమార్, పద్మాపురం పంచాయతీలు పెసా ఉపాధ్యక్షులు కిల్లో సీతారాం, లోక్యోయి గంగరాజు, వార్డు సభ్యుడు వంతల డేవిడ్,వార్డు సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిరాం

హైడ్రోపై కన్నెర్ర

-తక్షణమే అనుమతులు రద్దు చేయాలి
- ఆదివాసీ గిరిజనుల మహాధర్నా



భారీగా తరలివచ్చిన గిరిజనులు

ప్రజాశక్తి -హుకుంపేట :హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులు వెంటనే రద్దు చేయాలంటూ గిరిజన సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మహా ధర్నా సోమవారం చేపట్టారు. తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మోహన్ మాట్లాడే ప్రయత్నం చేసిన సర్దుమనగలేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాము నోటీసులు జారీ చేశామంటూ డిటీ చెప్పారు. రాళ్లగడ్డ సమీపంలో 14 పంచాయతీల అనంతగిరి మండలం (వేంగడ, వాలసీ, పైనంపాడు, లంగుపర్తి, పెద్దబిడ్డ, టోకూరు, పెద్దకోట, పినకోట, గుమ్మకోట, రూమ్ పల్లి, బింపోలు) తోపాటు అరకువేలి మండలంలోని బస్కీ, లోతేరు, హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ ప్రజలు సమిష్టిగా పాల్గొన్నారు. మొత్తం 17 పంచాయతీలకు చెందిన సుమారు 4,000 మంది ఒకే వేదికపై చేరి నినాదాలు చేస్తూ భారీ ఆందోళన నిర్వహించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేసి వాహనాల నడుమ కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. అనంతరం ఆందోళనకారులు భారీ ర్యాలీగా తహసిల్దార్ కార్యాలయం చేరి ప్రాజెక్టు రద్దు డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. హుకుంపేట మండలం బూర్జ పంచాయితీలో నవయుగ కంపెనీ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన హైడ్రో పవర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో హుకుంపేట తహసిల్దార్ కార్యాలయం వద్ద అనంతరం బహిరంగ సభను ఏర్పాటు చేశారు.ఈ సభకు పోరాట కమిటీ కన్వీనర్ సురేష్ కుమార్ అధ్యక్షత వహించగా, గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనరస, అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అప్పలనరస మాట్లాడుతూ, ఆదివాసీ సమాజాన్ని సమూలంగా సమాధి చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. టైగర్ జోన్ పేరిట ఆదివాసులను అడవుల నుండి తరిమేయాలని చూస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. పోడు వ్యవసాయం చేసే రైతులపై అక్రమ కేసులు నమోదు చేయడం, 5వ షెడ్యూల్ భూభాగాన్ని అప్పగింతల రూపంలో నవయుగ, అదాని కంపెనీలకు కట్టబెట్టాలని కేంద్రం చూస్తోందని దుయ్యబట్టారు.1/70 చట్టం, పిసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం అమల్లో ఉన్నా ప్రాజెక్టులకు అనుమతులు ఎలా ఇచ్చారనిప్రశ్నించారు.వెంటనే హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులను నిలిపివేసి, నవయుగ కంపెనీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, బూర్జ, మజ్జివలస ప్రజలు హైడ్రో ప్రాజెక్టు భూతం నుండి మమ్మల్ని కాపాడాలని పదే పదే ఆందోళనలు చేపడుతున్నా, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు."ప్రజలు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నా, ఎన్నికల్లో గిరిజన ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులుమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలుమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు.

అనంతగిరి జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, 51 జీవో ప్రాజెక్టు అమలుతో గిరిజన గ్రామాల ఆవాసాలు, సాగుభూములు ముంపు ప్రాంతాల్లో చిక్కుకుంటాయని, అడవి జీవవైవిధ్యం నాశనం అవుతుందని అయన స్పష్టం చేశారు. గిరిజన రైతులపై ఉన్న అన్ని కేసులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాళ్ల గడ్డ నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు రెండు కిలోమీటర్లు కాలిబాటన భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి కృష్ణారావు, ఆదివాసి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వి లక్ష్మణరావు, నాయకులు అప్పలకొండ పడాలి, డిఎల్ఓ రాష్ట్ర అధ్యక్షులు రంజిత్ కుమార్,సర్పంచ్ పాంగి మోతి వైస్ సర్పంచ్ సింబోయ్ లక్ష్మి ఎంపీటీసీ మజ్జి హరి కన్వీనర్ మజ్జి సురేష్ బాబు కో కన్వీనర్ మజ్జి కృష్ణంరాజు, బొంజు బాబు, బాలరాజు,శోభన్, రామకృష్ణ, వరుణ్ కుమార్, పరుశురాం పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న నాయకులు, గిరిజనులు



మాట్లాడుతున్న అప్పలనరస

డిఆర్‌పిలకు శిక్షణ

ప్రజాశక్తి- పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయిలో డి ఆర్ పి లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ రావు సమగ్ర శిక్ష ఏపీసి వి స్వామి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన బేస్ లైన్ టెస్ట్ గ్రేడ్ ఆధారంగా విద్యార్థులు అత్యుత్తమ స్థాయి కల్పించేందుకు జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇవ్వడం నిమిత్తం జిల్లా కలెక్టర్ మరియు స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా స్థాయిలో డిఆర్పి లకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ శిక్షణ అనంతరం డిఆర్పిలు మండలాలకు వెళ్లి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తారని విద్యాశాఖ అధికారులు తెలిపారు ఈ కార్యక్రమానికి అకాడమిక్ మానిటరింగ్ అధికారి కే భాస్కరరావు సీఎంఓ జ్ఞాన ప్రకాష్, ఏపీవో ఎంఎస్ఎల్ పాత్రుడు మండలవిద్యాశాఖ అధికారులు జాన్, సరస్వతి, నాగరాజు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న సభ్యురాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం వేదికగా ప్రతి మూడు నెలలకు ఓ సారి స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. స్థానిక మండల ఎంపీపీ ఈశ్వరి అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమస్యల పరిష్కారానికి ప్రధానమైన ఈ సమావేశం ఆలస్యంగా ప్రారంభం అవడం విశేషం. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావలసిన సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. సమయానికి హాజరు కాని అధికారులపై సభ్యులు అగ్రహం వ్యక్తం చేసి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోకు సభ్యులు సూచించారు. దీనికి తోడు అధికారులు కూడా కొంతమంది ఎంపీటీసీ, సర్పంచులకు సమాచారం ఇవ్వకపోవడంతో సభ్యులు ఆలస్యంగా హాజరయ్యామన్నారు. ఈ సమావేశంలో ఆయా పంచాయతీ పరిధిలోని ఎంపిటిసిలు, సర్పంచులు పంచాయతీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తారు. సమాచారం ఇవ్వకుండా ఏ విధంగా తాము హాజరు అవుతామని ప్రశ్నించారు.ఈ సందర్భంగా గసభ పంచాయితీ జంగిడి వలస, గొందివలస, సిమిలిగుడ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, జంగిడి వలస పాఠశాలలో పూర్తిస్థాయి ఉపాధ్యాయుడిని నియమించాలని ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత ఎంఈఓ 2 జి గెన్ను దృష్టికి తీసుకెళ్లింది. స్వర్ణాయిగూడ పాఠశాలలో ఉన్న ఎల్ఈడి టీవీను అక్కడి అప్పటి ఉపాధ్యాయుడు తీసుకెళ్లి పాత టీవీని స్కూల్లో పెట్టినట్లుగా కంద్రం పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ పోరం మండల అధ్యక్షుడు కే హరి ఎంఈఓ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఎస్ ఆనంద్, పి లలిత, ఇన్చార్జ్ ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సత్తా చాటిన విద్యార్థులు

కరాటే పోటీల్లో సత్తా

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు :వండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బాలురు 2లో చదువుతున్న విద్యార్థులు ఇంటర్నేషనల్ కోఫోకన్ కరాటే క్లబ్ పాండు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో నలుగురు విద్యార్థులు సత్తాచాటారు. పసుపు రంగు బెల్ట్ ను కైవశం చేసుకున్నట్లు కరాటే శిక్షకుడు కే.సురేష్ బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ తెలిపారు. ఏనుగురై పంచాయతీ బోండా పుట్టు గ్రామానికి చెందిన గడుతూల నవీన్ కుమార్, వనబసింగి పంచాయతీ లుంగపుట్టు గ్రామానికి చెందిన పెట్టియా ఆనంద్, జామ్ గూడా పంచాయితీ జామ్ గూడా గ్రామానికి చెందిన కిలో. సతీష్ కుమార్, కించై పుట్టు పంచాయితీ సరియ పుట్టు గ్రామానికి చెందిన చంద్రకాంత్ పడాల్ ప్రతిభను కనబరచి పసుపు రంగు బెల్టును కైవసం చేసుకున్నారన్నారు .కరాటే మాస్టర్ ఆర్ సూర్య ప్రకాష్ 'బ్లాక్ బెల్ట్) ఈ సందర్భంగా మాట్లాడుతూ కరాటే శిక్షణ తీసుకోవడంతో శారీరక దృఢత్వం తో పాటు మానసికంగా కూడా దృఢంగా ఉండటమే కాకుండా క్రమశిక్షణతో మెలుగుతారన్నారు.

బోధన మెరుగునకు శిక్షణ దోహదం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉపాధ్యాయుల విద్యాబోధన పటిష్టం చేయడం కోసమే శిక్షణ నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం టి.నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తలారిసింగి టిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు జరుగుతున్న వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారగలరని అన్నారు. బోధన నైపుణ్యాలు మెరుగుపడితే పఠన లెక్కింపు, విశ్లేషణాత్మక ఆలోచన, సామర్థ్యాలు విద్యార్థుల్లో లక్ష్య నిర్ధారణ అలవాటు చేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన పద్ధతులను అవలంబించాలన్నారు. శిక్షణ అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్ఎం నాగేశ్వరరావు

యూరియా కోసం అవస్థలు



ఎటపాక: యూరియా కోసం క్యూలో నిరీక్షిస్తున్న రైతులు



హుకుంపేటలో యూరియా కోసం ఎండలో నిలబడిన రైతులు

ప్రజాశక్తి- ఎటపాక : తోటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా సోమవారం యూరియా పంపిణీ చేశారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుండి సొసైటీ కార్యాలయం ముందు రైతులు బారులు తీరారు. గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడినా ఒక బస్తా ఇచ్చారని ఇలా ఉంటే వ్యవసాయం ఎలా చేయాలని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు.

సీలేరు: జికె వీధి మండలం గుమ్మిరేవులు, ధారకొండ దుప్పిలివాడ పంచాయతీ పరిధి గిరిజన రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సోమవారం యూరియా పంపిణీ చేశామని ఎస్సై రవీంద్ర వెల్లడించారు. దుప్పిలివాడ పంచాయతీలో ఆరు టన్నులు ధారకొండ పంచాయితీలో పది టన్నులు గుమ్మిరేవుల పంచాయతీలో ఆరు టన్నులు పంపిణీ చేశామని పేర్కొన్నారు.

మారేడుమిల్లి: మండలంలో డి.వెలమలకోట రైతుసేవ కేంద్రంలో యూరియా అందుబాటులో ఉంచడం జరిగిందని అగ్రికల్చర్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. 5 మెట్రిక్ టన్నుల యూరియాను సున్నంపాడు, జిఎంవలస రైతుసేవా కేంద్రాల పరిధిలో గ్రామాలకు సంబంధించిన రైతులకు ఇస్తామని మిగిలిన యూరియా డి వెలమల కోట, డిసిహెచ్‌పాలెం, తాడేపల్లి రైతు సేవా కేంద్రాలలో గ్రామాల రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

హుకుంపేట: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువుల కోసం గిరిజన రైతులు చూడాల్సి వచ్చింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచే క్యూలో నిలబడి ఎదురుచూశారు. వ్యవసాయశాఖ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఎరువుల పంపిణీ ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జ్ఞాన ప్రకాష్ మాట్లాడుతూ, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎరువుల సరఫరాను క్రమబద్ధంగా కొనసాగిస్తోందన్నారు. కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-సీలేరు: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీలేరు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎపి జెన్‌కో చెక్‌పోస్ట్‌పై నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు ముందస్తుగా సమాచారం అందిందన్నారు. ఆదివారం ఉదయం సిబ్బందితో వెళ్లి వాహన తనిఖీలు చేపడుతుండగా ఇద్దరు యువకులు ఐదు కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలానికి చెందిన గోవిందరాజు(21)ని అదుపులోనికి తీసుకున్నామని, మరో నిందితుడు పరారయ్యాడని అతని కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు.



అరెస్టయిన నిందితునితో పోలీసులు

మళ్లీ పెరుగుతున్న గోదావరి

- భద్రాచలం వద్ద 39.5 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఆందోళనలో ముంపు వాసులు

ప్రజాశక్తి- ఎటపాక : గోదావరి నీటి మట్టం మళ్లీ క్రమంగా పెరుగుతోంది. ఎగువున కురుస్తున్న వర్షాలకు వస్తున్న వరదకు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం 39.5 అడుగులకు చేరుకుంది. నందిగాం, మురుమూరు, తోటపల్లి, నెల్లిపాక వాగుల్లో వరద నీరు పోటేసింది. ఇంతకాలం వర్షాలు వరదలతో మిర్చి రైతులు ఎదురుచూసి ఇప్పుడిప్పుడే మిరప నాట్లు వేయసాగారు. ఈ తరుణంలో మళ్లీ గోదావరి పెరుగుతుండడంతో రైతు భయాందోళనలకు గురవుతున్నారు. పంట కాలం దాటిపోతుందని, వేసిన పంట మునిగితే మరో అవకాశం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వి.ఆర్.పురం: గోదావరికి ఎగువన, కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి వరద ఉధృతి నెమ్మదిగా పెరగటం మొదలైంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి ప్రవాహం పెరిగినట్లు అధికారులు తెలిపారు. మండలంలో కూడా కురిసిన వర్షాల ప్రభావంతో వాగులు వంకలు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు గ్రామాల ప్రజలు ముందస్తుగా గుట్టలపై పాకలను నిర్మించుకున్నారు. శ్రీరామగిరి, చొక్కానపల్లి, గుండుగూడెం, అడివివెంకన్నగూడెం, సృష్టివారిగూడెం, లోతట్టు గ్రామాల ప్రజలు మైదాన ప్రాంతంలో గుట్టలపై గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. దిగువన కురుస్తున్న వర్షాలకు ఏ క్షణమైనా వరదలు వచ్చే అవకాశం ఉందని ముందు జాగ్రత్త చర్యగా పాకలు చేసుకున్నామని వారు తెలిపారు. ఈ నెలలో మిర్చి పువ్వాకు వేసే సమయం వచ్చిందని ఇప్పుడు వరదలు వస్తే వ్యవసాయం సాగే పరిస్థితి లేదని ఇప్పటికే చాలా ఆలస్యం అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



నందిగామ వాగు వద్ద వరద పరిస్థితి

కోడిపందాలు ఆడుతున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - కొయ్యూరు : కొయ్యూరు మండలం ఆర్.కొత్తూరు శివారులో కోడిపందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్సై కిషోర్‌వర్మ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి కోడిపందాల శిబిరంపై దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,250, 4 కోడిపుంజులు, 2కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి- కొయ్యూరు: చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయవద్దని, తడి,పొడి చెత్తను వేరువేరుగా చెత్తబుట్టల్లో వేయాలని కొయ్యూరు మండలం ఎం.మాకవరం గ్రామసచివాలయ ఎఎన్ఎం సత్యవతి అన్నారు. సోమవారం పనసలపాడులో ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారికి సూచించారు. చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని క్లాప్‌మిత్రకు సూచించారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి -రంపచోడవరం: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం జన్మన్, డిఎ జూగా పథకాలు ద్వారా ఒక్కొక్క శాఖలో ఎన్ని పనులు మంజూరయ్యాయి, ఎన్ని పూర్తయ్యాయి, ఎన్ని అవ్వాల్సి ఉంది అనేది ఆరా తీశారు. పంచాయతీరాజ్ పాఠశాలల నిర్మాణం గురించి, గిరిజనుల ఇళ్లకు సంబంధించి కరెంట్ మీటర్ల గురించి, జీడిమామిడి ప్రాసెసింగ్ మిషనరీలు గురించి ఆరా తీశారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు, వెలుగు ఎపిడి దేగలయ్య పిహెచ్ఒ దేవదానం, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షరీఫ్, డిఎల్‌డిఒ కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, గాబ్రియేలు, రవికుమార్, ఏడీఏలు సావిత్రి, రామ్మోహన్ రావుదొర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న పిఒ స్మరణ్‌రాజ్

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల అర్జీలు వ్యక్తిగతానికి సంబంధించిన వినతులు కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించి వినతులకు పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పిఒ, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, సబ్‌కలెక్టర్ పరిపాలన అధికారి సావిత్రి పాల్గొన్నారు. పిఒ స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ ఈవారం సుమారు 70 అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు.

కొత్త విద్యుత్తులైన్ నిర్మించాలి

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని పెద్ద ఆర్కూర్ సర్పంచ్ నాగమణి సోమవారం చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో పిఒ అపూర్వభరత్‌ను కలసి ఆర్కూర్ పంచాయతీలో భగవాన్‌పురం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైందని దీంతో గిరిజన గ్రామాలకు తీవ్రమైన విద్యుత్ సమస్య ఉంటోందని ఆర్‌అండ్‌బి రోడ్డు వెంబడి చిన్నాఆర్కూర్ నుండి రేగులపాడు వరకూ కొత్త విద్యుత్తులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. గండికొత్తగూడెం గ్రామంలో అంగన్‌వాడి భవనం బాగుచేయాలని కోరారు. విభిన్నప్రతిభావంతుడికి మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని అందించాలని వినతిపత్రం అందజేశారు పిఒ స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారని అన్నారు.

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: మాదకద్రవ్యాలు విని యోగం వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులకు ఈగల్ డిపార్ట్ మెంట్ అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. సోమవారం జిల్లాపరిషత్ పాఠశాలలో ఐజిపి ఆర్‌కె. రవికృష్ణ, ఆదేశాల మేరకు విద్యార్థులకు హెచ్ఎం ఆదిలక్ష్మి అధ్యక్షతన డ్రగ్స్‌వద్దు బ్రో అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐ సూర్యమోహన్‌రావు, ఎస్ఐ సురేష్‌కుమార్ మాట్లాడారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం,వాటి దుష్పరిణామాలు, ఈగల్ క్లబ్స్ పనితీరుపై అవగాహన కల్పించారు. ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972 గురించి వివరించారు.ఆనంతరం స్టూడెంట్స్‌తో డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుళాయి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మారేడుమిల్లి: పున్నంపాడు పంచాయతీ నూరుపూడి లో సోమవారం రూ.17.50 లక్షలతో జలజీవమిషన్‌లో భాగంగా ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టి సంక్షేమ కమిటీ అధ్యక్షురాలు మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు కూటమి నాయకులు టిడిపి మారేడు మిల్లి మండల అధ్యక్షులు గురుకు శేష్‌కుమార్ ఆధ్వర్యంలో పైప్‌లైన్ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మారేడుమిల్లి ఎంపిపి సార్ల లలితకుమారి, ఎంపిటిసి అనిల్, స్టేట్ డైరెక్టర్, స్టేట్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సుబాని, బిజెపి మండల అధ్యక్షులు రేవుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న శేషుకుమార్

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో విఫలం



వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి-చింతపల్లి : రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కాకరి చంద్రరావు విమర్శించారు. సోమవారం ఆయన నేతృత్వంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో చింతపల్లి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వం విస్మరిస్తోందని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డి.ఏలు వెంటనే విడుదల చేయాలని, జీవో 57ను అమలు చేసి పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి, ఉద్యోగుల భవిష్యత్ భద్రతను కాపాడాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి వేతన సవరణలను తక్షణమే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, గంగరాజు, శేఖర్, చిట్టినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం శక్తి యాప్ వినియోగం పై విద్యార్థినులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా ఎఎస్ఐ సుశీల మాట్లాడుతూ, మహిళారక్షణ , భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని, అత్యవసర పరిస్థితుల్లో మహిళలు యాప్ ఓపెన్ చేసి ఎస్ఓఎస్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే, వీడియో, ఆడియో ఆటోమేటిక్‌గా రికార్డయి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందని, తద్వారా పోలీసులు అప్రమత్తమై అక్కడికి తక్షణం చేరుకుంటున్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీవాణి మాట్లాడుతూ శక్తి యాప్‌లోని 'సేఫ్ ట్రావెల్ ఆప్షన్‌ను ఎంచుకుంటే ధీమాగా, ధైర్యంగా, సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చన్నారు ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా ఈ యాప్‌ను ఫోన్లో డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు పోలీస్ సిబ్బంది నాగేశ్వరరావు, బి శివ, కె జగదీష్, ఎ హరిత పాల్గొన్నారు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

ప్రజాశక్తి- సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వ అనుమతితో రాష్ట్రంలో నిర్మించి, ప్రభుత్వమే నిర్వహించాల్సిన ప్రభుత్వ వైద్యకళాశాలలకు పిపిపి పద్ధతిలో ప్రయివేటుకు కట్టబెట్టాలన్న కూటమి ప్రభుత్వ చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ కార్యదర్శి జెవి ప్రభాకర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం జరిగింది ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది, వాటిలో ఐదింటిని ప్రారంభించి, మరో రెండు కాలేజీలు నిర్మాణాలు పూర్తయిన, ప్రారంభించని పరిస్థితుల్లో మిగిలిన పది కాలేజీలు నిర్మాణాలు నిలిపివేసి,కాలేజీలన్నిటిని పిపిపి విధానంలో అభివృద్ధి చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం సరికాదన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు వైద్యవిద్యను దూరం చేసేలా కూటమి ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, వాటిని వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.జి సత్యనారాయణ, పి రవీంద్ర బాబు, ఈ .జయరాజు ,ఎం పైడిరాజు, శ్రీనివాసరావు, వైటి దాస్, మారుతి శ్రీనివాస్, సిద్ధార్థ రవి పాల్గొన్నారు

17న ఐద్వా మహాసభ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మహిళా నేతలు

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు : పాడేరులో ఈనెల 17వ తేదీ బుధవారం నిర్వహించే మహాసభలను విజయవంతంగా జయప్రదం చేయాలని మండల ఆదివాసి గిరిజన మహిళలకు (ఐద్వా) సంఘం మండల అధ్యక్షురాలు ఎస్ విజయ, కార్యదర్శి సోనియా ఈశ్వరిలు సోమవారం కోరారు.ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షురాలు ఎస్ విజయ మాట్లాడుతూ, మహిళలపై హింసను అరికట్టాలన్నారు. మహిళలకు సామాజికంగా , ఆర్థికంగా, రాజకీయంగా పురుషులతో సమానం అవకాశం కల్పించే విధంగా చైతన్య పరచడమే ధ్యేయంగా జిల్లా మహాసభలను చేపడుతున్నామన్నారు. ఐద్వా మండల కార్యదర్శి సోనియా ఈశ్వరి మాట్లాడుతూ, మహిళలకు ఆసరా కింద రూ.1500 ఇవ్వాలని, హింస లేని సమాజం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను బడా కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టి ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ మహాసభల్లో మండల నలుమూలల నుండి ఆదివాసి గిరిజన మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మండల సాధన సమితి నేతలు

ప్రజాశక్తి-పెదబయలు : గోమంగి మండలం ఏర్పాటుకు కృషి చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు గోమంగి మండల సాధన సమితి నాయకులు సోమవారం వినతి పత్రం ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ గోమంగి మండలం కావాలని చేస్తున్న పోరాటం న్యాయబద్ధమైనదని, తను కూడా అధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోమంగి మండల సాధన సమితి అధ్యక్షులు సల్లంగి ఉమామహేశ్వరరావు, పెదబయలు జెడ్పిటిసి సభ్యులు కూడ బొంజుబాబు, మాజీ ఎంపీపీ జర్సింగి సూర్యనారాయణ, కొమ్మ అనంత పద్మనాభం, కూడ రాధాకృష్ణ, జామిగూడ సర్పంచ్ తెరవాడ వెంకటరావు, గుల్లేలు మాజీ సర్పంచ్ నాగరాజు, చిక్కుడు కోటిబాబు, సిదెరి లక్ష్మీ నాయుడు, చిక్కుడు సూరయ్య పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధి

- బార్క్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు
- ముగిసిన విస్టా టెక్ 2కె25 జాతీయ ఫెస్ట్



విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న విజ్ఞాన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఉక్కునగరం : నేటితరం యువత ఉద్యోగాలకు పరిమితం కాకుండా, పరిశోధనలో ముందుకు సాగి, దేశాభివృద్ధికి తోడ్పడాలని, టెక్నాలజీని వినియోగించి పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి దిశగా కొత్త ఆవిష్కరణలు చేయాలని బార్క్ ప్రాజెక్టు డైరెక్టర్, శాస్త్రవేత్త ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం దువ్వాడలోని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్‌లో జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ 2025 ముగింపు రోజున ఇంజినీర్స్‌డే సందర్భంగా అబ్దుల్‌కలాం సెంటర్ ఫర్ నేషన్ భవనంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు రోజు టెక్‌ఫెస్ట్‌లో వివిధ విభాగాల్లో పోటీల్లో విజేతలకు రూ.మూడు లక్షల విలువైన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి, కొత్త ఆలోచనలను ప్రోత్సహించ డానికి, పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలను అలవర్చుకోవడానికి విస్టా 2కె25 వంటి టెక్నికల్ ఫెస్టివల్స్ దోహదపడతాయన్నారు.

రెక్టార్ వి. మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా వర్క్‌షాప్‌లు, టెక్‌ఫెస్ట్‌ల్లో చురుగ్గా పాల్గొని, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ముగింపు కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ క్రాంతికుమార్ గంగు వందనసమర్పణ చేయగా, జాతీయగీతాలాపనతో జాతీయఫెస్ట్ ముగిసింది.

తరచుగా దొంగతనాలతో బెంబేలు




చోరీకి గురైన దుకాణాలు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ:- మండల కేంద్రంలోని కిరాణా దుకాణాల్లో తరచుగా దొంగతనాలకు జరుగుతున్నాయి. సుమారు గత వారం రోజుల క్రితం మల్ల కేంద్రంలోని ఓ కిరాణా దుకాణ షాపు చోరీకి గురవ్వగా ఆదివారం రాత్రి కేజీబీవీ పాఠశాలకు ఎదురుగానున్న కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. కేజీబీవీ ఎదురుగానున్న శెట్టి మల్లేశ్వరరావు కిరాణా దుకాణన్ని శనివారం రాత్రి దుకాణ తలుపులు తెరిచి దొంగతనం చేయడానికి ప్రయత్నించిన సాధ్యపడలేదు. దీంతో మళ్లీ ఆదివారం రాత్రి అదే దుకాణంలో చోరీకి పాల్పడి షాపులో ఉన్న సామాన్లను దొంగిలించి ఎత్తుకుపోయినట్లు దుకాణ యజమాని మల్లేశ్వరరావు స్థానిక విలెకర్లకు తెలిపారు. గత వారం రోజుల క్రితం బిఎస్ఎన్ఎల్ టవర్కు అనుకొని ఉన్న కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడగా, వారం తర్వాత మరో షాపు చోరీకి గురవడంతో మండలం కేంద్రంలోని కిరాణా దుకాణదారులు భయాందోళనకు గురవుతున్నారు. కిరాణా దుకాణాలు చోరీకి పాల్పడుతున్న దొంగలు చిల్లర దొంగల లేక ! వేరే వారు ఎవరైనా ఉన్నారా! అనేది తెలియాల్సి ఉంది. వీటితోపాటు సైకిళ్లు ,బైకులు కూడా చోరీకి గురవుతున్నట్లు స్థానికులు అంటున్నారు. తక్షణమే పోలీస్ అధికారులు స్పందించి మండల కేంద్రంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక మండల కేంద్రం వాసులు కోరుతున్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన విద్యార్థులు

ప్రజాశక్తి-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు మొత్తం 54 మంది రక్తదానం చేశారు. రక్తదానానికి సంబంధించిన సర్టిఫికెట్లను జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్, జిల్లా మెడికల్ ఆఫీసర్, రెడ్‌క్రాస్ నోడల్ అధికారి సంతకాలతో కలిపి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసపాత్రుడు, డాక్టర్ డి. కేజియా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

యోగా న్యాయనిర్ణేతగా శ్రీను

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జె. శ్రీను జాతీయస్థాయి యోగా న్యాయ నిర్ణేతల పరీక్షల్లో అర్హత సాధించారు. యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హరియాణాలో నిర్వహించిన ఆన్‌లైన్ గ్రేడ్-3 పరీక్షలో ప్రతిభ చూపారు. శ్రీనును ఎపి యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్‌వి. నరసింహస్వామి రాజు, జనరల్ సెక్రటరీ ఎం. అవినాష్ శెట్టి, పాఠశాల డైరెక్టర్ దూసి రామకృష్ణ అభినందించారు.

సిపిఎంపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి-కూనవరం: మూడు రోజుల కిందట ఎటపాక మండలంలో గిరిజనేతరుల భూస్వాముల సమావేశానికి హాజరైన వెంకయ్య బిజెపి పేరు చెప్పి, సిపిఎంపై తప్పుడు ఆరోపణలు చేశాడని ఇది మానుకోవాలని కూనవరం సిపిఎం నాయకులు హితవు పలికారు. మండలంలోని సిపిఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాయం వెంకయ్య సిపిఎం జిల్లా కమిటీ సభ్యులను, రాష్ట్ర కమిటీ సభ్యులను ప్రస్తావిస్తూ ఆరోపణలు చేస్తుండటాన్ని చూస్తే ఆయనను త్వరలో ఎర్రగడ్డ ఆసుపత్రికి తీసుకు వెళ్లాల్సి వస్తుందేమో అనే సందేహం కలుగుతోందని ఎద్దేవా చేశారు. గిరిజనుల పోడుభూమిలో ఆరెకరాలు ఆక్రమించుకుని ఇప్పుడు అందులో మామిడితోట వేసినది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆయనకు దమ్ము ధైర్యం ఉంటే నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్అండ్ఆర్, నష్టపరిహారంతో పాటు గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతకు ఆర్అండ్ఆర్ ఇప్పించాలని సవాల్ చేశారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసం సిపిఎంపై అవాస్తవాలు మాట్లాడటం సరికాదని హితువు పలికారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు నాగమణి, పార్టీ మండల కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల కమిటీ సభ్యులు పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.



సన్మానించిన సచివాలయ ఉద్యోగులు

సచివాలయ సిబ్బందికి ఘన సన్మానం

ప్రజాశక్తి-జికె వీధి : మండలంలోని దేవరపల్లి సచివాలయంలో ఐదేళ్లుగా సేవలందించి ప్రజల మన్ననలు పొందిన సచివాలయ సిబ్బందికి సోమవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు, మాజీ జెడ్‌పిటిసి మచ్చల మత్స్యరాజు, ఎంపిటిసి కృష్ణమూర్తి, తదితరులు మాట్లాడుతూ సిబ్బంది చాలా చక్కగా పనిచేశారని బదిలీపై వెళ్ళినచోట కూడా చక్కగా పనిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి స్వామి నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పించాలని వినతి

ప్రజాశక్తి-మోతుగూడెం: చింతూరు మండలం, ఆదివాసి గిరిజన సంఘ ఆధ్వర్యంలో మోతుగూడెంలో యుఇయు (సిఐటియు) కార్యాలయంలో డొంకరాయి (సిఐటియు) కార్యదర్శి ముక్త అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చింతా రాంబాబు మాట్లాడుతూ సీలేరు నుంచి మోతుగూడెం వరకూ సుమారు 30 గ్రామాల్లో 300 మందికి పైగా నిరుద్యోగ యువత ఉన్నారని వారికి జీవనోపాధి కల్పించాలని ఎపి జెన్కో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎపి జెన్‌కో చీఫ్ ఇంజినీర్‌కి వినతిపత్రం అందించారు. సమావేశంలో డేవిడ్, మంభోధనో, ప్రసాద్, గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

17 నుంచి మహిళలకు ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -సీలేరు: జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వస్థ్ నారీసశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జికె వీధి మండలం సీలేరు పిహెచ్‌సి పరిధిలో నిర్వహిస్తామని వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌వల్లి హోమియో వైద్యాధికారి సృజనరాయి పేర్కొన్నారు. సోమవారం వైద్యసిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడుతూ సెప్టెంబర్ 17న సీలేరు పిహెచ్‌సిలో 19న దుప్పిలివాడ పరిధి గొర్రిలోవలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్త్రీలకు బిపి, షుగర్, క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ, ఎఎన్ఎం గౌరమ్మ, సంచార చికిత్స 104 ప్రోగ్రాం డేటా ఎంట్రీ ఆర్గనైజర్ వర్ష, ఆశా కార్యకర్త వసంత సిహెచ్‌డబ్ల్యూ సంగీత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను



మాట్లాడుతున్న కుంజ శ్రీను

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని టేకులబోరు గ్రామంలో సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ సమావేశం నిర్వహించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ ప్రజలచే ఎన్నుకోబడిన కట్టం రాజమ్మ మరణానంతరం నిబంధనల ప్రకారం ఆరునెలల్లో ఎన్నికలు నిర్వహించి సర్పంచ్‌ని ఎన్నుకోవాలి కానీ కూనవరం పంచాయతీలో గిరిజనేతరుడు అయిన హేమంత్ (వైస్‌సర్పంచ్)ని పూర్తిస్థాయి సర్పంచ్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. దీనిపై ఐటిడిఎ పిఒ, కలెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. పలు అభివృద్ధి పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారని మండిపడ్డారు. ఇటీవల వచ్చిన వరదలకు సంబంధించి శానిటేషన్ బిల్స్ కూడా తప్పుడు మార్గంలో డ్రా చేసుకున్నారని ఆరోపించారు. పంచాయతీకి సంబంధించి ఏ అభివృద్ధి కార్యక్రమం జరగాలన్న పంచాయితీ తీర్మానం జరగాలని కానీ గతంలో పనిచేసిన పంచాయతీ సెక్రటరీ సురేష్ ప్రస్తుత సర్పంచ్ హేమంత్ ఏకపక్షంగా వ్యవహరించి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్స్ కారం సంధ్య, గుజ్జ కమల, కార్యకర్తలు కట్టం వెంకటేష్ పాల్గొన్నారు.

పశు వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



హుకుంపేటలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది



సీలేరులో టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

ప్రజాశక్తి -కొయ్యూరు : పశువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొయ్యూరు మండలం ఎం.మాకవరం సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ చైతన్య రైతులకు సూచించారు. సోమవారం గింజర్తి, చింతలపూడి గ్రామాల్లో పర్యటించారు. పశవులకు వైద్యపరీక్షలు నిర్వహించి, టీకాలు వేసి, మందులు పంపిణీ చేశారు.

జికెవీధి : మండలంలో సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15 వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. గాలికుంటువ్యాధి నివారణ టీకాలు పశువులకు వేయించాలని కోరారు. మినరల్ మిక్సర్ ప్యాకెట్స్ నట్టలపాముల మందులు అందించారు. సర్పంచ్ వంశీకృష్ణ వైస్ ఎంపిటిసి సప్పగడ్డ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: స్థానిక పశవైద్యశాలలో పశవులకు సోమవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఇంచార్జి పశువైద్యాధికారి లోపల రమేష్ 45 గేదెలకు 51 ఆవులకు గాలికుంటువ్యాధినిరోధక టీకాలు వేశారు.కార్యక్రమంలో లైవ్‌స్టాక్ సహాయకురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అరకులోయరూరల్: గాలి కుంటు వ్యాధి నివారణ మందులతోనే సాధ్యపడుతుందని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి సీనయ్య అన్నారు. గన్నెల రైతు సేవ కేంద్రం పరిధిలోని అమలగుడ, ఆర్కే నగర్, గన్నెల గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్ వేశారు. విఎల్ఓ సాంబశివరావు,పశుసంవర్ధక సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని కోట్నపల్లి, తీగలవలస, హుకుంపేట, పాతకోటమట్టం పంచాయతీలలో పశువులకు టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి చరణ్ రైతులను పలు సూచనలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం, అనంతగిరి పశువైద్యాధికారులు సాగరి గణేశ్వరరావు, అనిల్ టీకాలు వేశారు.కాశీపట్నం పంచాయతీ బంగారం పేట, టోకురు పంచాయతీ పూలగుడ గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి టీకాలు వేశారు.

'అమ్మను బాగా చూసుకో' చిత్రాన్ని ఆదరించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: పాశ్చాత్య నాగరికత మోజులో, తల్లిదండ్రులను విస్మరించి గ్రామాలను విడిచిపెట్టి నగరాలకు, విదేశాలకు వెళుతున్న పిల్లలు బాధ్యతలను గుర్తు చేస్తూ, శ్రీ సాయి లక్ష్మి ప్రొడక్షన్‌పై తాను నిర్మాతగా,దర్శకునిగా తీసిన చిత్రం 'అమ్మను బాగా చూసుకో'అని దర్శకుడు గొంప నాగభూషణం తెలిపారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో చిత్ర యూనిట్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. త్వరలోనే విడుదల కానున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు.

డాగ్ కెన్నల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ : విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో జివిఎంసి నిధులతో నిర్మించిన డాగ్ కెన్నల్‌ను సోమవారం మేయర్ పీలా శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పాత వాటికి అదనంగా మరో ఏడు శునకాలను విశాఖకు తీసుకురావడం జరిగిందని రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా పది ప్రత్యేక నార్కోటిక్ తనిఖీల్లో శిక్షణ పొందిన డాగ్స్ మన వద్ద ఉన్నాయని ఇవి గంజాయి నిర్మూలనకు తోడ్పడుతాయని తెలిపారు. డ్రగ్స్ తర్ఫీదులో ప్రథమ బహుమతి పొందిన లైకా విశాఖపట్నం రావడం గర్వకారణం అని మేయర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందిస్తున్నామని తెలిపారు.

నేడు విశాఖకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఈనెల 17 బుధవారం విశాఖ నగరంలో జరగనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం విశాఖ రానున్నారు. మంగళవారం సాయంత్రం 6.25 గంటలకు ఢిల్లీలో బయలుందేరి 7.45 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుండి రోడ్ మార్గంలో 8.30 గంటలకు ఋషికొండ సమీపంలో రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుని అక్కడ బస చేస్తారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి 11.30 వరకు వైజాగ్ కన్వెన్షన్ సెంటర్ లో జరగనున్న నెక్స్ జెన్ జిఎస్టి రిఫామ్స్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 12 గంటల నుండి అదే ప్రాంగణంలో ప్రధాన మంత్రి వర్చువల్‌గా పాల్గొనే 'స్వస్తి నారి శక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో పాల్గొంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుండి 4.15 వరకూ రాడిసన్ బ్లూ హోటల్ లో జరగనున్న 'జిసిసి బిజినెస్ సమ్మిట్'లో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు హోటల్ నుండి బయలుదేరి 5.45కు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని 6.15 గంటలకు బయలుదేరి ఢిల్లీ వెళతారు.

సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వై.రెడ్డికి డిఆర్ఎం ప్రశంసలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ హోం గార్డ్స్ నుండి కాంస్య డిస్క్ ప్రశంసాపత్రం అందుకోవడంలో విశిష్ట విజయాన్ని సాధించినందుకు వాల్తేర్ డివిజన్ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్ కె.వై.రెడ్డిని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బోహ్రా అభినందించారు. 2024లో డిఫెన్స్‌రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. కె.వై.రెడ్డి సెప్టెంబర్ 10న న్యూఢిల్లీలో రైల్వేబోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సివిల్‌ఇంజనీరింగ్-జి) అజిత్‌కుమార్‌ఝూ నుండి పతకం, సర్టిఫికెట్‌ను అందుకున్నారు. సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ఎకె ముత్తక్కర్ పాల్గొన్నారు.

ఫార్మా రంగ అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఫార్మా రంగంలో రాష్ట్రాన్ని జాతీయహబ్‌గా మార్చేందుకు కేంద్రం నుంచి మరింత సహకారం అవసరం అని ఎస్ఆర్‌సి లాబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్, బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. అభివద్ధి, భవిష్యత్ అవకాశాలపై బీచ్ రోడ్‌లోని నోవాటెల్‌హోటల్‌లో సోమవారం స్టేక్‌హోల్డర్స్ సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విస్తత చర్చలు జరిపారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల విస్తరణతోపాటు మెడికల్ డివైసెస్ తయారీని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎపిలో విశాఖ, అనకాపల్లి, కాకినాడ ప్రాంతాలు మెడికల్ డివైసెస్ తయారీకి అనువైన క్లస్టర్లుగా అభివృద్ధి చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ , రాష్ట్ర భారీ పరిశ్రమలమంత్రి టీజీ భరత్, అనకాపల్లి ఎంపి సిఎం. రమేష్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'కలర్స్ హెల్త్ కేర్ 2' ప్రారంభం



కలర్స్ హెల్త్ కేర్-2 ప్రారంభిస్తున్న సినీనటి సంయుక్తమీనన్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ప్రముఖ హెల్త్ కేర్ సంస్థ 'కలర్స్ హెల్త్ కేర్' సంస్థ విశాఖపట్నంలో తన నూతన బ్రాంచ్‌ను ప్రారంభించింది. రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన 'కలర్స్ హెల్త్ కేర్-2 ను హీరోయిన్ సంయుక్త మీనన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన సేవలను ఆధునిక టెక్నాలజీతో అందిస్తున్న కలర్స్ హెల్త్ కేర్‌కు అభినందనలు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట శివాజీకూన మాట్లాడుతూ 2004లో ప్రారంభమైన కలర్స్ హెల్త్ కేర్ ఇప్పటివరకు వేలాది మంది కస్టమర్లకు సేవలందించిందన్నారు.